


ఆమెకు జై



తల్లిగా బిడ్డను కంటికి రెప్పలా కాపాడుతోంది.. మమతానురాగాలకు చిరునామాగా నిలుస్తోంది.. తోబుట్టువుగా ప్రేమను పంచుతోంది.. ఆలిగా మగవాడి బతుకులో సగపాలు తనదిగా కష్టసుఖాల్లో తోడూనీడగా ఉంటోంది.. ప్రతి పురుషుడి విజయం వెనుక 'ఆమె' కీలక పాత్ర పోషిస్తోంది.. ఇంటికి దీపం ఇల్లాలుగా కుటుంబానికి వెలుగులు పంచుతోంది.. సేవకు ప్రతిరూపంగా నిలుస్తోంది.. ఒకవైపు వంటింట్లో గరిటె తిప్పుతూనే మరోవైపు రాజకీయాలు, పాలనలోనూ 'చక్రం' తిప్పుతోంది.. ఒకప్పుడు గృహిణులుగానే పరిమితమైన మహిళలు నేడు అన్ని రంగాల్లో 'రాణి'స్తున్నారు.. ఆకాశంలో సగం కాదు అన్నింట్లోనూ ముందే అని నిరూపిస్తున్నారు.. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనాలు..

న్యూస్‌రీల్

మహిళా సాధికారతే లక్ష్యంగా పని చేయాలి



మాట్లాడుతున్న డీసీపీ సునీతారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: మహిళా సాధికారతే లక్ష్యంగా పని చేయాలని మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని గురునానక్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీసీపీ మాట్లాడుతూ.. సృష్టికి మూలం మహిళలే అని అన్నారు. సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర చాలా గొప్పదన్నారు. వారి రక్షణ కోసం ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం పని చేస్తోందన్నారు. మహిళల భద్రత కోసం పటిష్ట చట్టాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. షీటీం ఆకతాయిలపై కొరడా ఝులిపిస్తోందని తెలిపారు. మహిళలను చైతన్యం చేయడం ద్వారానే హత్యలు, అత్యాచారాలు తగ్గుముఖం పడతాయన్నారు. కార్యక్రమంలో గురునానక్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ హెచ్ఎస్ సైనీ, అధ్యాపకులు, పాల్గొన్నారు.

'స్మయిల్ ఆల్వేస్'కు ఉత్తమ అవార్డు



అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ నుంచి అవార్డు అందుకుంటున్న సుధామనుడు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆడబిడ్డల చదువుకు అండగా నిలుస్తున్న స్మయిల్ ఆల్వేస్ ఫౌండేషన్ సంస్థ సేవలను ప్రభుత్వం గుర్తించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తమ సేవా అవార్డును ప్రకటించింది. కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో స్మయిల్ ఆల్వేస్ ఫౌండేషన్ సంస్థ అధ్యక్షుడు కోడి సుధామనుడుకు అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ అవార్డు అందజేశారు. శాలువతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా సుధామనుడు మాట్లాడుతూ.. 500 మంది ఆడబిడ్డలను చదివించడమే కాకుండా దాదాపు 100 మందికి ఆశ్రయం కల్పిస్తున్నట్లు తెలిపారు. అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు.

సామాన్యులకు నాణ్యమైన వైద్యమే లక్ష్యం



జన ఔషధ కేంద్రంలో మందులు కొని రసీదు తీసుకుంటున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మీర్‌పేట: సామాన్య ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యమని చేవెళ్ల లోక్‌సభ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రపంచ ఔషధ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా ఆదేశాల మేరకు శుక్రవారం మీర్‌పేట రైతుబజార్ వద్ద ప్రధానమంత్రి భారతీయ జన ఔషధ (జనరిక్ మెడికల్) కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుతం వైద్యం ఎంతో ఖరీదుతో కూడుకున్నదని, తక్కువ ధరకే పేదలకు మందులు అందించాలన్న ఉద్దేశంతో కేంద్రం ఔషధ కేంద్రాలను ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ కేంద్రాల్లో 80 నుంచి 90 శాతం వరకు తగ్గింపుతో మందులు లభిస్తాయని తెలిపారు. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఆయన జనరిక్ మాత్రలను కొనుగోలు చేసి గూగుల్‌పే ద్వారా బిల్లు చెల్లించారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల శ్రీరాములు యాదవ్, కొలన్ శంకర్‌రెడ్డి, మీర్‌పేట-1,2 అధ్యక్షులు భిక్షపతిచారి, ముఖేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఇండియాకు ప్రవీణ్ మృతదేహం

కేశంపేట: అమెరికాలో మృతిచెందిన విద్యార్థి ప్రవీణ్‌కుమార్ మృతదేహం ఆదివారం ఇండియాకు రానుంది. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న అనంతరం స్వగ్రామం కేశంపేటకు తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా ప్రవీణ్ తల్లిదండ్రులు గంప రాఘవులు, రామాదేవి దంపతులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య వేర్వేరుగా పరామర్శించారు. ఫోన్‌ద్వారా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ పరామర్శించారు.

ఆ నలుగురూ.. అక్షర జ్యోతులే..



తల్లి అండాలుతో కూతుళ్లు

ఇబ్రహీంపట్నం రూరల్: నిరుపేద కుటుంబానికి చెందిన వారికి నలుగురు కూతుళ్లు.. అంతా ఆడ పిల్లలే అని ఏనాడూ బాధపడలేదు. బాగా చదివిస్తే వారే కుటుంబానికి వెలుగవుతారని నిర్ణయించుకున్నారు. ఇబ్రహీంపట్నం మండలం తుర్కగూడ అనుబంధ గ్రామం ఎర్రగుంటకు చెందిన కత్తుల అండాలు దేవదాసు దంపతులకు శ్వేత, నిఖిత, మేఘన, దీక్షిత నలుగురు సంతానం. భార్యాభర్తలిద్దరూ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. పిల్లలను తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో చేర్పించారు. అనంతరం పెద్ద కూమార్తె శ్వేత తమిళనాడులోని కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ పూర్తి చేసింది. ఇబ్రహీంపట్నంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తోంది. రెండో కుమార్తె నిఖిత బీటెక్ చదివి, బెంగళూర్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తోంది. మూడో కూతురు మేఘన కరీంనగర్‌లోని మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. చిన్న కుమార్తె దీక్షిత చిన్నప్పటి నుంచి ఆటల్లో మేటి. అథ్లెటిక్స్, ఖోఖోలో రాష్ట్ర స్థాయిలో అనేక పతకాలు సాధించింది. ప్రస్తుతం బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. నలుగురూ ఇబ్బందులు, ఒడిదొడుకులు ఎదురైనా చదువును కొనసాగిస్తున్నారు. నిరుపేద కుటుంబంలో పుట్టినా ఉన్నత చదువులు చదువుతూ నలుగురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

వహ్వా.. వాకా లక్ష్మీశైలజ



విధుల్లో భాగంగా వీల్స్‌కు సంబంధించిన పనులు చేస్తున్న వాకా లక్ష్మీశైలజ

మీర్‌పేట: తల్లి వృద్ధాప్యం.. సోదరుడు అనారోగ్యంతో జీవితకాలం మంచానికే పరిమితం.. అన్నీ తానై అటు ఇంటి బాధ్యతను చూస్తూ.. ఇటు ఉద్యోగం చేస్తూ ఆదర్శంగా నిలుస్తోంది వాకా లక్ష్మీశైలజ. మీర్‌పేట జిల్లెలగూడకు చెందిన వాకా లక్ష్మీశైలజ సౌత్‌సెంట్రల్ రైల్వే విభాగం సికింద్రాబాద్ డివిజన్ లాలాగూడలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తోంది. సాధారణంగా ఈ విభాగంలో పురుషులే ఎక్కువగా పనిచేస్తుంటారు. శైలజ గతంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసినప్పటికీ మానేసి రైల్వేలో ఉద్యోగం సాధించింది. విధి నిర్వహణలో కఠినమైన మెకానికల్ పనుల్లో భాగంగా మగవారికి దీటుగా రైల్వే వీల్స్‌కు సంబంధించిన పనులు చేస్తోంది. ఉద్యోగంతో పాటు కుటుంబ పోషణ భారమంతా తనపైనే వేసుకుని తల్లి, సోదరుడి ఆలనా, పాలనా చూసుకుంటూ కంటికి రెప్పలా కాపాడుకుంటోంది. ఉద్యోగంతో పాటు రైల్వే అవగాహన కార్యక్రమాలు, సాంస్కృతిక, ప్రజా అవగాహన కార్యక్రమాల్లో సైతం చురుగ్గా పాల్గొంటోంది. రైల్వే ఉన్నతాధికారుల నుంచి పలుమార్లు ప్రశంసా పత్రాలు అందుకుంది. 'మహిళలు అందివచ్చే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని.. అన్ని రంగాల్లో రాణించాలని' అంటోంది.

'మద్ది' సిస్టర్స్.. అదుర్స్



వాహనాలు నడుపుతున్న మణిదీపా రెడ్డి, సహస్రా రెడ్డి

పహాడీషరీఫ్: ఆడ, మగ తేడా లేకుండా ఆ దంపతులు ఇద్దరు కుమార్తెలను పెంచి పెద్ద చేశారు. ఆత్మరక్షణ కోసం కరాటేలో శిక్షణ ఇప్పించారు. ఉన్నత చదువులు చదివిస్తూనే.. బుల్లెట్ బండి, కార్ల డ్రైవింగ్ సైతం నేర్పించి అన్ని విధాలా ప్రోత్సహిస్తున్నారు. బాలాపూర్ మండల పరిధిలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన మద్ది సబిత, రాజశేఖర్ రెడ్డి దంపతులకు మణిదీపా రెడ్డి, సహస్రారెడ్డి ఇద్దరు ఆడ పిల్లలు. వారిని ప్రత్యేకంగా పెంచాలనుకున్నారు. పెద్ద కుమార్తె మణిదీపా రెడ్డికి కరాటేతో పాటు బాస్కెట్ బాల్ నేర్పించారు. ఈమె ఇప్పటికే ఎన్నో టోర్నమెంట్‌ల్లో ప్రదర్శనలు ఇచ్చి జాతీయ స్థాయిలో అవార్డులు అందుకుంది. ప్రస్తుతం సివిల్స్‌కు ప్రిపేరవుతోంది. చిన్న కుమార్తె సహస్రారెడ్డి వైద్య విద్యను అభ్యసిస్తోంది. సబిత 2020-25 మధ్య కాలంలో మీర్‌పేట్ కార్పొరేషన్‌లో కార్పొరేటర్‌గా పని చేశారు. రాజశేఖర్ రెడ్డి బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా ఉన్నారు.

వందనం.. 'కందివనం'



విధి నిర్వహణలో కందివనం పద్మ (ఇన్‌సెట్‌లో) పద్మ

షాబాద్: ఒకవైపు బ్రాంచ్ పోస్టుమాస్టర్‌గా విధులు నిర్వర్తిస్తూ.. మరోవైపు ఇద్దరు ఆడపిల్లలను చదివించి ప్రయోజకులను చేసి వివాహాలు జరిపించారు మండలంలోని తాళ్లపల్లి గ్రామానికి కందివనం పద్మ. భర్త కైలాస్‌గౌడ్ 15 సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో కుటుంబ భారం ఆమెపై పడింది. భర్త చేస్తున్న ఉద్యోగాన్ని చేపట్టింది. తండ్రి లేని లోటు తెలియకుండా ఇద్దరు ఆడపిల్లలను మగ పిల్లలతో సమానంగా పెంచింది. డిగ్రీ వరకు చదివించి పెళ్లిళ్లు చేసింది. ఇప్పటికీ ఇల్లిల్లూ తిరుగుతూ ఉత్తరాలు బట్వాడా చేస్తూ.. పింఛన్లు అందిస్తూ.. ఊరివాళ్లతో కలుపుగోలుగా మెలుగుతూ జీవనం సాగిస్తోంది. 'ఎన్ని సమస్యలు ఎదురైనా మహిళలు సహనాన్ని కోల్పోవద్దని.. ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలని.. సహనం, పట్టుదల ఉంటే ఎలాంటి లక్ష్యమైన చేరుకోగలం' అని చెబుతోంది.

వైకల్యాన్ని జయించి..



గర్భిణిని పరీక్షిస్తున్న డాక్టర్ రేవతిరెడ్డి

శంకర్‌పల్లి: పుట్టుకతో అంగవైకల్యం ఉన్నప్పటికీ డాక్టర్ కావాలనుకునే లక్ష్యాన్ని సాధించానని అంటున్నారు శంకర్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ రేవతిరెడ్డి. అమ్మానాన్నలు రేయింబవళ్లు కష్టపడ్డారని.. తాను, తన అక్క కలలు కన్న లక్ష్యాల కోసం నిరంతరం తాపత్రయ పడ్డారని చెబుతున్నారు.

చదువులో చురుగ్గా..

వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలం దేవరంపల్లి గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి, సరళ దంపతులకు ఇద్దరు కూతుళ్లు. పెద్ద కూతురు మాధవి రెడ్డి, చిన్న కూతురు రేవతి రెడ్డి. వెంకట్‌రెడ్డి వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించాడు. చిన్న కూతురు రేవతిరెడ్డికి చిన్నతనం నుంచే అంగవైకల్యం ఉన్నప్పటికీ చదువులో చురుగ్గా ఉండేది. గమనించిన తండ్రి ఆమెను వెన్నుతట్టి ప్రోత్సహించాడు. శంకర్‌పల్లి పట్టణంలోని శ్రీ వివేకానంద పాఠశాలలో 7వ తరగతి వరకు, 10వ తరగతి వరకు వికారాబాద్ ఎన్నేపల్లిలోని సంఘం లక్ష్మీబాయి రెసిడెన్షియల్ పాఠశాలలో, ఇంటర్ వరంగల్ హసన్‌పర్తిలోని ఏపీ ఆర్‌జేసీలో చదువుకుంది. ఎంబీబీఎస్‌లో దివ్యాంగుల కోటాలో సీటు రాకపోవడంతో ఓపేన్ ఎ కేటగిరీలో నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలోని కామినేని మెడికల్ కాలేజీలో సీటు సాధించింది.

పొలం అమ్మేసి ..

కూతురికి ఎంబీబీఎస్‌లో సీటు రావడంతో తండ్రి ఎంతో సంతోషించాడు. ఎంత కష్టమైనా చదివించాలనుకున్నాడు. పెద్ద కూతురు ఎంఎస్సీ, చిన్న కూతురు ఎంబీబీఎస్ కోసం సంవత్సరానికి రూ.లక్షల్లో ఖర్చవుతుండడంతో ఊర్లోని ఆరు ఎకరాల పొలం అమ్మి చదివించాడు. 2008లో పెద్ద కూతురు మాధవిరెడ్డి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సాధించగా.. 2014లో రేవతిరెడ్డి ఎంబీబీఎస్ పూర్తి చేసింది. 2014 నుంచి 15 వరకు కోస్గి, 2015-18 నవాబ్‌పేట్, ప్రస్తుతం శంకర్‌పల్లి పీహెచ్‌సీల్లో వైద్యురాలిగా సేవలందిస్తోంది.

ప్రభుత్వం నుంచి అవార్డులు

రేవతిరెడ్డి ఆస్పత్రికి వచ్చే నిరుపేదలకు బాసటగా నిలుస్తోంది. ఆమె వైద్య సేవలను గుర్తించి 2023లో కలెక్టర్ ఉత్తమ వైద్యురాలి అవార్డుకి ఎంపిక చేశారు. జిల్లా వైద్యా, ఆరోగ్య శాఖ వారు సాధారణ ప్రసవాలు, ఉత్తమ సేవలకుగాను రెండు సార్లు అవార్డులు అందించారు. డాక్టర్ రేవతిరెడ్డికి 2017లో పాండురంగారెడ్డి తో వివాహం జరిగింది. ఆరేళ్ల పాప, మూడేళ్ల బాబు ఉన్నాడు. తండ్రి వెంకట్‌రెడ్డి 2020లో గుండెపోటుతో మృతి చెందాడు. అప్పటి నుంచి రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతున్న తల్లి సంరక్షణ అక్కాచెల్లెళ్లు చూసుకుంటున్నారు.

ఆడపిల్లలే అనుకోకుండా కరాటేలో శిక్షణ



కూతుళ్లకు శిక్షణ ఇస్తున్న కృష్ణ

చేవెళ్ల: నలుగురూ ఆడపిల్లలే.. అయినా ఎందులోనూ తీసిపోకూడదనే ఉద్దేశంతో మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇస్తున్నాడు ఆ తండ్రి. మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన కావలి కృష్ణ, దివ్య దంపతులు. వారికి నలుగురు ఆడపిల్లలు. కృష్ణ చిన్నతనంలో నేర్చుకున్న కరాటే తన కుటుంబానికి జీవనాధారంగా మారింది. కరాటేలో 5వ డాన్ బ్లాక్‌బెల్టు సాధించిన అతడు శిక్షణ తరగతులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. నలుగురు ఆడపిల్లలు అన్న బాధ లేకుండా వారిలో ఆత్మవిశ్వాసం నింపితే సమాజంలో అందరితో సమానంగా రాణిస్తారని నమ్మాడు. దీంతో కూతుళ్లకు కరాటేలో శిక్షణ ఇస్తున్నాడు. పెద్ద కూతురు జేమిమ్మ ఎనిమిదేళ్ల వయస్సులోనే కరాటేలో వైట్, ఎల్లో, ఆరెంజ్ బెల్టులు సాధించింది. రెండో కూతురు రూతు ఆరేళ్ల వయసులో వైట్, ఎల్లో బెల్టులు సాధించింది. మూడో కూతురు జేరుషా సైతం నాలుగేళ్లకే అక్కలతోపాటు కరాటేలో శిక్షణ తీసుకుంటోంది. 'నాకున్న ఆస్తి, ధైర్యం నా నలుగురు అమ్మాయిలే. ఎక్కడా వారు తక్కువ కాకుండా ఉండాలనే కరాటేలో శిక్షణ ఇస్తున్నాను. వారికి ఇష్టమైన ఏ రంగంలో అయినా రాణించేందుకు పూర్తి సహకారం అందిస్తాను' అంటున్నాడు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆకాంక్షించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మార్పు ఇంటి నుంచే ప్రారంభం కావాలని అన్నారు. కుటుంబానికి మూలం మహిళ అని గుర్తు చేశారు. అమ్మాయిలు, అబ్బాయిలను సమానంగా పెంచాలన్నారు. మహిళా ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. మహిళలకు ఆర్థికంగా, విద్యాపరంగా సమాన హక్కులు కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వ రంగంలో ఉన్న వారంతా మహిళా అభివృద్ధి కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్, డీఆర్‌ఓ సంగీత, జిల్లా టీజీఓ అధ్యక్షుడు డాక్టర్ రామారావు, టీజీఓ కార్యదర్శి శ్రీనేష్‌కుమార్ నోరి, జిల్లా సంక్షేమాధికారి సంధ్యారాణి, సీడీపీఓ శాంతిశ్రీ, రేవతి, అలివేలు, అనిత, సుజాత, సైదమ్మ, గంప శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాలనలో 'కీ'లకం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లా పరిపాలనా భవనంలో మొత్తం 192 మంది మహిళా ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరిలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ సహా పలు కీలక విభాగాలకు ఉన్నతాధికారులుగా వ్యవహరిస్తున్నారు. రెవెన్యూ విభాగంలో 27 మంది, డీఆర్‌డీఏలో 32 మంది, జిల్లా విద్యాశాఖలో 16 మంది, సివిల్ సప్లయ్‌లో 13 మంది, పంచాయతీరాజ్ విభాగంలో 12 మంది, కో ఆపరేటివ్ విభాగంలో తొమ్మిది మంది, ఉద్యాన వన శాఖలో ఆరుగురు, ట్రెజరీలో 8 మంది, సీపీఓలో ఆరుగురు, అర్బన్ సీలింగ్ లాండ్స్‌లో ఆరుగురు, డీ సెక్షన్‌లో ఐదుగురు, సీ సెక్షన్‌లో ముగ్గురు, లాండ్ ప్రొటెక్షన్స్‌లో నలుగురు, భూసేకరణ విభాగంలో ముగ్గురు, హౌసింగ్ కార్పొరేషన్‌లో ముగ్గురు, మత్స్యశాఖలో నలుగురు చొప్పున పని చేస్తున్నారు. పరిశ్రమల శాఖలో నలుగురు, గిరిజన, మైనార్టీ విభాగాల్లో ఆరుగురు, లాండ్స్ రికార్డ్స్ విభాగంలో నలుగురు, బీసీ సంక్షేమశాఖలో నలుగురు, మెప్మాలో ఒకరు చొప్పున మహిళా ఉద్యోగులు పని చేస్తున్నారు. ఇక వైద్య ఆరో గ్యశాఖ, స్త్రీ, శిశు సంక్షేమశాఖల్లో పూర్తిగా వారిదే ఆధిపత్యం. అక్కడ పని చేస్తున్న ఉద్యోగుల్లో మెజార్టీ మహిళలే.

విభాగం	అధికారి
అధనపు కలెక్టర్ (రెవెన్యూ, స్థానిక సంస్థలు)	ప్రతిమాసింగ్
జిల్లా రెవెన్యూ అధికారి	సంగీత
గ్రామీణాభివృద్ధి సంస్థ	ఎల్.శ్రీలత
జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ విభాగం	సంధ్యారాణి
జిల్లా గిరిజన సంక్షేమ శాఖ	రామేశ్వరి
పరిశ్రమలశాఖ జీఎం	శ్రీలక్ష్మి
మెప్మా పీడీ	మల్లేశ్వరి
అడల్ట్ ఎడ్యుకేషన్	అనిత
చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్	పి.సౌమ్య
డీటీసీపీఓ	పి.సువర్ణదేవి
ఎక్సైజ్ సూపరింటెండెంట్ సరూర్‌నగర్	ఉజ్వలారెడ్డి
డిప్యూటీ డైరెక్టర్ డీటీఓ	బి.పద్మావతి
ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ	ఎస్.రాజేశ్వరి
జిల్లా ఉపాధి కల్పన అధికారి	జి.జయశ్రీ
హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్	ఇందిరాదేవి
మార్కెఫెడ్, డీఎం	ఎండీ తమినా

గొప్పశక్తిగా మహిళ



ఒకప్పుడు పూర్తిగా ఇంటికే పరిమితమైన మహిళలు ప్రస్తుతం అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ఒకవైపు కుటుంబ బాధ్యతను.. మరోవైపు అధికారిక కర్తవ్యాన్ని విజయవంతంగా నిర్వర్తిస్తున్నారు. పురుషులకు ఏమాత్రం తీసిపోవడం లేదు. పాలనాపరమైన అంశాల్లో అమెరికా కంటే భారతీయ మహిళలలే ముందున్నారు. 40 ఏళ్ల క్రితమే ఇందిరాగాంధీ దేశ ప్రధానిగా పని చేయడమే ఇందుకు ఉదాహరణ. ఉన్నత చదువులు చదువుకుంటూ.. ఉన్నతంగా రాణిస్తున్నారు. శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా గొప్ప శక్తిగా ఎదుగుతున్నారు

– ప్రతిమాసింగ్, అదనపు కలెక్టర్

లైఫ్‌ను బ్యాలెన్స్ చేసుకుని..



నాన్న టీఎస్ నరసింహన్ సహా ఇంట్లో అంతా ఉన్నత చదువులు చదివిన వారే. నాకు ముగ్గురు బ్రదర్స్. వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. నాన్న స్ఫూర్తితో చదువుకున్నా. స్వస్థలం ఉమ్మడి నల్లగొండ జిల్లా అయినప్పటికీ పుట్టిపెరిగింది మొదలు.. ప్రాథమిక, ఉన్నత విద్యాభ్యాసం అంతా హైదరాబాద్‌లోనే. సెంట్రల్ వర్సిటీలో ఎంఏ ఇంగ్లిష్ పూర్తి చేశా. గ్రూప్స్ రాశాను. తొలి ప్రయత్నంలో రాకపోవడంతో ప్రైవేటు కాలేజీలో లెక్చరర్‌గా పని చేశాను. గ్రూప్-1కు ప్రిపేరయ్యాను. గ్రూప్-2 పరీక్ష రాసి, విదేశాలకు వెళ్లాలని భావిస్తున్న సమయంలో ఫలితం వచ్చింది. హైదరాబాద్‌లో ట్రెనింగ్.. వరంగల్‌లో పోస్టింగ్ ఇచ్చారు. అప్పటి కలెక్టర్ సుమితా దావ్రా డీఆర్‌డీఏ పీడీగా నియమించారు. గ్రూప్-2 కేడర్‌కు చెందిన ఓ మహిళా ఉద్యోగిని, గ్రూప్-1 కేడర్ పోస్టులో ఎలా కూర్చొబెడతారని జాయినింగ్ రోజే పురుష ఉద్యోగుల నుంచి వ్యతిరేకత ఎదుర్కొన్నా. వారి సవాల్‌ను చాలెంజ్‌గా తీసుకున్నా. సమర్థవంతంగా పని చేశా. తర్వాత వివిధ జిల్లాల్లో, ఆయా విభాగాల్లో విధులు నిర్వర్తించా. ఒక వైపు కుటుంబ బాధ్యతలు.. మరోవైపు ప్రభుత్వ అధికారిగా విధులు.. లైఫ్‌ను బ్యాలెన్స్ చేసుకుని ముందుకు సాగుతున్నా.


– టీఎల్ సంగీత, జిల్లా రెవెన్యూ అధికారి


చిన్నచూపు వద్దు



మాది పూర్వ నల్లగొండజిల్లా హుజూర్‌నగర్. నాన్నకు నలుగురం సంతానం. పేద, మధ్య తరగతి కుటుంబం. ముగ్గురు అమ్మాయిలే అయినామా నాన్న మమ్మల్ని చదువు విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయలేదు. కష్టపడి చదివించారు. ప్రాథమిక విద్యాభ్యాసం అంతా సొంతూరిలోనే. విజయవాడలో ఇంటర్, డిగ్రీ పూర్తి చేశాను. కోఠి ఉమెన్స్ కాలేజీలో ఎకనామిక్స్‌లో పీజీ చేశాను. బీఈడీ పూర్తి చేసి, స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాను. గెజిటెడ్, నాన్ గెజిటెడ్ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా డైరెక్ట్ సెలక్షన్ ద్వారా వచ్చాను. మిర్యాలగూడలో తొలి పోస్టింగ్ వచ్చింది. ఆ తర్వాత ఖమ్మం, కరీంనగర్, సంగారెడ్డిలో ఏడీ చైల్డ్ వెల్ఫేర్‌గా పని చేశాను. ఆ తర్వాత ఇక్కడికి బదిలీపై వచ్చా. నా భర్త కూడా ప్రభుత్వ ఉద్యోగే. ఆయన రెవెన్యూ విభాగంలో పని చేస్తారు. మాకు ఇద్దరు పిల్లలు. ఇటు ఆఫీసు, అటు ఇంటికి సమప్రాధాన్యత ఇస్తాను. మహిళలను చిన్నచూపు చూడొద్దు. ప్రోత్సహిస్తే.. మగవాళ్లకు దీటుగా రాణిస్తారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలంటే ముందు చదువుకోవాలి. ఇందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ హాస్టళ్లను కూడా ఏర్పాటు చేసింది.

– సంధ్యారాణి, స్త్రీ, శిశు సంక్షేమ సంఘం అధికారి





తెలిసిన వారితోనే ఇబ్బంది

- మహిళలపై పలుచోట్ల కొనసాగుతున్న వివక్ష
- బస్టాప్‌లు, కాలేజీల్లో పురుషాధిక్యం
- ఇబ్బంది పెడుతున్న సెల్‌ఫోన్ మెసేజ్‌లు

సాక్షి, రంగారెడ్డి జిల్లా, వికారాబాద్: సమాజంలో మహిళల పట్ల కొనసాగుతున్న వివక్షపై రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో సాక్షి ప్రత్యేక సర్వే నిర్వహించింది. 15 నుంచి 18 ఏళ్ల వయసున్న బాలికలు, 18నుంచి 25 ఏళ్ల వయసున్న యువతులు, 25 నుంచి 35 సంవత్సరాలున్న అతివలు, 35 నుంచి 50 ఏళ్ల వయసున్న వంద మంది మహిళలను (25 మంది చొప్పున) నాలుగు విభాగాలుగా చేసి సర్వే నిర్వహించగా.. వారి నుంచి పలు ఆసక్తికర విషయాలు తెలిశాయి. మహిళలు అన్ని రంగాల్లో విశేషంగా రాణిస్తున్నప్పటికీ పలు చోట్ల వివక్ష కొనసాగుతోందని, స్కూళ్లు, కాలేజీలు, పని ప్రదేశాల్లో ఇతరుల నుంచి కొంత ఇబ్బంది ఎదురవుతోందని, బస్టాప్‌లు, ఆఫీసుల్లో పురుషాధిక్యం ఉందని, సెల్‌ఫోన్లలో వచ్చే మెసేజ్‌లు తమను ఎక్కువగా బాధ పెడుతున్నాయని, వీరిలో తెలియని వారికన్నా తెలిసిన వారే ఎక్కువగా ఇబ్బంది పెడుతున్నారని సర్వే వెల్లడిస్తోంది.

డీజేతో ఇబ్బందిపెట్టిన వారికి రూ.18 వేలు జరిమానా

చేవెళ్ల: డీజే సౌండ్‌లతో ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని చేవెళ్ల ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈనెల 4న చేవెళ్లకు చెందిన నాయక్ తన ఇంట్లో చిన్న విందు ఉండగా డీజే పెట్టించాడు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో కూడా సౌండ్‌లతో హోరెత్తించడంతో భరించలేని చుట్టుపక్కల వారు 100 డయల్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. దీంతో నాయక్‌తో పాటు డీజే అపరేటర్ హరీశ్వర్, డీజే ఓనర్ శివపై కేసులు నమోదు చేశారు. ఈ మేరకు శుక్రవారం వారిని న్యాయమూర్తి డి.ధీరజ్‌కుమార్ ఎదుట హాజరుపర్చగా ముగ్గురికీ కలిపి రూ.18 వేలు జరిమానా విధించారు. ఒక్కొక్కరు రూ.6 చొప్పున ఫైన్ చెల్లించాలని లేదంటే ఏడు రోజుల పాటు జైలు శిక్ష అనుభవించాలని తీర్పు ఇచ్చారు.

చిన్నారిపై వీధికుక్కల దాడి

అంబర్‌పేట: ఇంటి ముందు ఆడుకుంటున్న ఓ చిన్నారిపై వీధి కుక్కలు దాడి చేసిన ఘటన శుక్రవారం రాత్రి గోల్నాక కమలనగర్‌లో చోటు చేసుకుంది. స్థానికంగా నివసించే లక్ష్మణ్, మమతల కుమార్తె శ్రీలక్ష్మి (19 నెలలు) శుక్రవారం ఇంటి ముందు ఆడుకుంటోంది. అదే సమయంలో అటుగా వచ్చిన వీధికుక్కలు చిన్నారిపై దాడి చేశాయి.



ప్రెస్‌క్లబ్‌లో సమావేశమైన ఆడపిల్లల సమానత్వ సమాఖ్య జిల్లా సభ్యులు

లింగసమానత్వ సాధనకు..

అనంతగిరి: బాలికలు ఉన్నత విద్యనభ్యసించేందుకు ఉన్న అడ్డంకులను తొలగించేందుకు రాష్ట్ర ఆడపిల్లల సమానత్వ సమాఖ్య పనిచేస్తోంది. ఉన్నత విద్యతోనే లింగసమానత్వం సాధ్యమనే ఉద్దేశంతో ఎంవీఎఫ్ ఆధ్వర్యంలో ఈ సమాఖ్య పోరాడుతోంది. గతేడాది మే లో ఏర్పడిన ఈ సంఘం కన్వీనర్‌గా కృప, జిల్లా కన్వీనర్‌గా జ్యోతి ఉన్నారు. 15 నుంచి 18 ఏళ్ల వయసున్న బాలికలు ప్రతినిధులుగా పనిచేస్తున్నారు. ఆరు జిల్లాల్లో ఆక్టివ్‌గా పనిచేస్తోంది. జిల్లా కమిటీలో 30మంది బాలికలున్నారు. బాలికలను విద్యాలక్ష్మిని చేయడమే సంఘం ఆశయం.

పదేళ్లుగా సాయం



ఆడబిడ్డ వివాహానికి నగదు సాయం అందిస్తున్న మంగశ్రీనివాస్

మంచాల: పేద గిరిజన కుటుంబానికి చెందిన పాతులోత్ మంగశ్రీనివాస్ దంపతులు సాయమంటే ముందుంటారు. మండల పరిధిలోని బండలేమూర్ మాజీ సర్పంచ్ మంగ దంపతులు రాజకీయాలకు రాక మందునుంచే పదేళ్లుగా గ్రామంలో ఎవరైనా చనిపోతే అంత్యక్రియలకు ఆర్థికసాయం చేసేవారు. అంతటితో ఆగకుండా గ్రామంలో ఏ ఆడ బిడ్డ వివాహం చేసినా నూతన దంపతులకు ఆశీర్వదిస్తూ రూ. పదివేలు ఆర్థికసాయం అందజేస్తున్నారు.

అతివలే అధికారులు

ఆమనగల్లు: సమాజంలో పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. మహిళలు ఉన్నత చదువులు చదివి ప్రభుత్వ ఉద్యోగులుగా సేవలు అందిస్తున్నారు. వ్యాపారం, క్రీడా రంగాల్లోనూ తమ ప్రతిభ చాటుతునర్నారు. ప్రజాప్రతినిధులుగా తామేమీ తీసిపోలేదంటూ ప్రజా మన్ననలు పొందుతున్నారు. మండల పరిధిలో ప్రభుత్వ శాఖల అధికారులంతా మహిళలే. ఆమనగల్లు ప్రథమశ్రేణి న్యాయమూర్తిగా కాటం స్వరూప, ఎంపీడీఓగా కుసుమ మాధురి, తహసీల్దార్‌గా లలిత, వ్యవసాయ శాఖ ఏడీగా శోభారాణి విధులు నిర్వహిస్తున్నారు.



లలిత, తహసీల్దార్



స్వరూప, న్యాయమూర్తి



కుసుమమాధురి, ఎంపీడీఓ



శోభారాణి, ఏడీఏ

ఆడ బిడ్డ పుడితే రూ.ఐదు వేలు.. వివాహానికి రూ.పది వేలు



వివాహానికి ఆర్థిక సాయం అందజేస్తున్న చిన్నతూప్ర మాజీ సర్పంచ్ రఘుపతి గౌడ్

మహేశ్వరం: తల్లిదండ్రులే లింగ భేదం చూపుతున్న సమాజంలో ఆడబిడ్డలున్న కుటుంబాలకు అండగా నిలుస్తున్నాడు. వారి కుటుంబాలకు ఆర్థికసాయం అందజేస్తూ పలువురికి ఆదర్శంగా ఉంటున్నాడు చిన్నతూప్ర మాజీ సర్పంచ్ కొండా రఘుపతిగౌడ్. మూడేళ్లుగా గ్రామంలో ఆడబిడ్డకు జన్మనిస్తే రూ.5వేలు, వివాహానికి రూ.10 వేలు సాయం అందజేస్తున్నాడు. భవిష్యత్‌లోనూ సాయం అందజేయడం ఆపేది లేదంటున్నాడు రఘుపతిగౌడ్

ఆడపిల్ల అంటే ధైర్యం



ఆడపిల్లలను భారంగా కాకుండా ధైర్యంగా భావించాలి. ప్రస్తుతం అన్ని రంగాల్లో అతివలే పై స్థాయిలో ఉన్నారు. సహనం కోల్పోకుండా ఆత్మస్థైర్యంతో సమస్యలను ఎదుర్కోవాలి. భర్తకు తోడుగా నిలుస్తూ పిల్లలను ఉన్నతంగా రాణించేలా ప్రోత్సహించాలి. లింగభేదం లేకుండా చదివించాలి.

– షేక్ ముంతాజ్, తహసీల్దార్, కడ్తాల్

మహిళలను ప్రోత్సహించాలి



మహిళలు విద్య, ఉద్యోగ, రాజకీయ, వ్యాపార రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలి. ప్రజాప్రతినిధులుగా మహిళలు ఉన్నప్పటికీ వారి భర్తలే పెత్తనం చెలాయించడం సరికాదు. వారు వేదికలపై మాట్లాడేలా భర్తలు అవగాహన కల్పించి ప్రోత్సహించాలి. ప్రభుత్వం మహిళలకు ప్రాధాన్య కల్పించాలి.

– రాజేశ్వరి, ఏపీఎం, కడ్తాల్.

సమానత్వ సమాజం నిర్మిద్దాం



మహిళా దినోత్సవం అనేది మహిళల శక్తిని, సహనాన్ని విజయాలను గౌరవించే ప్రత్యేకమైన రోజు. సమానత్వం కోసం చేసిన పోరాటాన్ని గుర్తు చేసే రోజు. సమాజంలో అన్ని రంగాల్లో మహిళలు కీలక భూమిక పోషిస్తున్నారు. మహిళలందరికి అవకాశాలు, గౌరవం, సమానత్వం కలిగిన సమాజాన్ని నిర్మించేందుకు అందరూ కృషి చేయాలి.

– సుజాత, ఎంపీడీఓ, కడ్తాల్

ఆత్మ విశ్వాసమే ఆయుధం



మహిళలకు ఆత్మ విశ్వాసాన్ని మించిన ఆయుధం లేదు. లింగబేధం లేకుండా పిల్లలను ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలి. మహిళలు రాణించేందుకు ప్రభుత్వం మరింత సహకారం అందించాలి.

– శ్రీలత, మండల వ్యవసాయ అధికారి

గౌరవ భావం పెరగాలి



సమాజానికి మహిళలు పట్టుకొమ్మలు. ఇంటి నిర్మాణంతో పాటు, సమాజ నిర్మాణానికి దోహదపడుతుంది. మహిళలు రాణించలేని రంగం ఏది లేదూ. మహిళల పట్ల సమాజంలో మరింత గౌరవ భావం పెరగాలి.

– అనిత, ఎస్‌ఓ, కేజీబీవీ, కడ్తాల్

స్వతంత్రంగా ఆలోచించాలి



మహిళలు స్వతంత్రంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటేనే అభివృద్ధి. ఆర్థిక స్వాతంత్ర్యం, విద్యతోనే మహిళలు ఏ రంగంలోనైన రాణించేందుకు అవకాశం ఉంటుంది. ఎన్ని అడ్డంకులు వచ్చినా ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్తేనే విజయం సొంతమవుతుంది. మనలోని ప్రతిభను గుర్తిస్తే లక్ష్యసాధన సులువు అవుతుంది.

– స్నేహలత, ఈఓ, మైసిగండి ఆలయం

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు

- ఎల్‌ఆర్‌ఎస్ రాయితీపై అవగాహన కల్పించండి
- గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్నవారిలో అర్హులను గుర్తించి వెంటనే గ్రౌండింగ్ చేయడంలో వేగం పెంచాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నా రు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళిక ప్రకారం చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందుకు మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. మార్చి 15 వరకు మిషన్ భగీరథ, గ్రిడ్ ఇంట్రా పనులకు గ్రౌండింగ్ చేపట్టి 20 వరకు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ దరకాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఎప్పటికప్పుడు పరిశీలించి గడువులోపు పూర్తి చేయాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ రాయితీపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా గ్రామాణాభివృద్ధి అధికారి శ్రీలత, పంచాయతీ అధికారి సురేష్ మోహన్, మిషన్ భగీరథ ఈఈ రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



జస్వంత్ సింగ్ (ఫైల్)

చేవెళ్ల: ఫ్లైవుడ్ షాపులో పనిచేసే ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల కేంద్రంలో రాజస్థాన్‌కు చెందిన హీర్ సింగ్మాసింగ్ రాందేవ్ ఫ్లైవుడ్ దుకాణం నడిపిస్తున్నాడు. ఆయన వద్ద వారి దూరపుబంధువైన జస్వంత్‌సింగ్ (18) మూడు నెలలుగా పనిచేస్తున్నాడు. గురువారం పనికి వచ్చిన యువకుడు సాయంత్రం 4గంటల ప్రాంతంలో రూమ్‌కు వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. దుకాణం బంద్ చేసిన హీర్ సింగ్మాసింగ్ జస్వంత్‌సింగ్‌కు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో షాప్ యజమాని ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ మేరకు శుక్రవారం ఆయన చేవెళ్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

పెండింగ్ వేతనాలు చెల్లించండి

జీపీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి



రామారావుకు వినతిపత్రం అందజేస్తున్న జీపీ వర్కర్స్ యూనియన్ సభ్యులు

కేశంపేట: పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలని జీపీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సంఘం నాయకులతో కలిసి పంచాయతీ రాజ్ డిప్యూటీ డైరెక్టర్ రామారావుకు వినతిపత్రం అందజేశారు. ఇందుకు స్పందించిన రామారావు వచ్చే బడ్జెట్ నుంచి గ్రీన్ చానల్ ద్వారా ప్రతీ నెల 1న వేతనాలు అందేలా చూస్తామన్నారు. టీఎస్‌బీఎస్ ద్వారా ఫిబ్రవరి వరకు ఉన్న వేతనాలను మంగళవారం వరకు చెల్లిస్తామన్నారు జనరల్ ఫండ్స్‌లో జనరేట్ చేసిన వేతనాల చెక్కులను క్లియర్ చేసేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరాజ్యం, మల్లయ్య, జిల్లా నాయకులు రాంచంద్రయ్య, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ముఠా అరెస్ట్

ముగ్గురికి రిమాండ్

శంకర్‌పల్లి: హైదరాబాద్ నుంచి నాగపూర్‌కు గంజాయికి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన మోకిల ఠాణా పరిధిలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. శుక్రవారం సీఐ వీరబాబు తెలిపిన ప్రకారం.. గురువారం సాయంత్రం ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు మీదుగా గంజాయి తరలిస్తున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. ఈ మేరకు మోకిల పోలీసులు శంకర్‌పల్లి మండలం ఇంద్రారెడ్డి నగర్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. హైదరాబాద్ నుంచి నాగపూర్‌కు స్విఫ్ట్ కారులో వెళ్తున్న నల్లగొండ జిల్లాకు చెందిన రమావత్ మత్రు(35), నేనావత్ తేజ(29), మహారాష్ట్రకు చెందిన నీలేశ్ బాబన్ కాలే(22)ను అదుపులోకి తీసుకున్నారు. కారులో తనిఖీ చేయగా 52 కిలోల గంజాయి పాకెట్లు లభ్యమయ్యాయి. పోలీసుల విచారణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మోతుగూడెం(ఆంధ్రా–ఒడిశా బార్డర్) నుంచి గంజాయి తీసుకు వచ్చామని.. పెద్ద అంబర్‌పేట ఓఆర్ఆర్ వద్దకు చేరుకున్నాక కొంత కారులో.. మిగిలినది సెప్టిక్ ట్యాంక్ వాహనంలో ఉంచి తరలిస్తున్నట్లు వెల్లడించారు. కాగా పోలీసులు సెప్టిక్ ట్యాంకు వాహనం కోసం గాలింపు చేపట్టారు. నిందితుల వద్ద 52 కిలోల గంజాయి, కారు, నాలుగు ఫోన్లు సీజ్ చేశారు. శుక్రవారం నిందితులను చేవెళ్ల కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్ నిమిత్తం సంగారెడ్డి జైలుకు తరలించారు.

విద్యతో పరిశోధనలను జోడించాలి

ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి

మొయినాబాద్: విద్యావ్యవస్థలో బహుముక పరిశోధనలను జోడించడంలో విద్యార్థులు, విద్యావేత్తలు, సామాజికవేత్తల పాత్ర కీలకమని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ వి.బాలకృష్ణారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని కేజీ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో అంగీకృత పరిశోధన, సుస్థిరాభివృద్ధిపై మూడు రోజుల పాటు నిర్వహించనున్న అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో దీర్ఘకాలిక సవాళ్లను అధిగమించేందుకు పర్యావరణ సుస్థిరత, వనరుల నిర్వహణ, సాంకేతిక అభివృద్ధి రంగాల్లో సృజనాత్మకత అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సింగపూర్ వర్సిటీ ప్రొఫెసర్ ఉపద్రస్తా రామమూర్తి, గ్రిట్ కళాశాల డీన్ స్వదేశ్ కుమార్ సింగ్, కేజీరెడ్డి కళాశాల చైర్మన్ కె.కృష్ణారెడ్డి, డైరెక్టర్ రోహిత్ కందకట్ల, ప్రిన్సిపాల్ సాయిసత్యనారాయణరెడ్డి, అరిస్టాటిల్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మూడుకు చేరిన మృతులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఓఆర్ఆర్‌పై గురువారం జరిగిన ప్రమాదంలో చికిత్స పొందుతున్న వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. ఆదిబట్ల ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపిన ప్రకారం.. గురువారం చోటు చేసుకున్న ప్రమాదంలో కారులో ఉన్న రవీంద్‌రెడ్డి, మొక్కలకు నీరు పడుతున్న కూలీ రాములు ఘటనా స్థలిలోనే మృతి చెందగా.. ప్రాణాపాయ స్థితిలో ఉన్న కృష్ణారెడ్డిని(50) నగరంలోని యశోదా ఆస్పత్రికి తరలించామన్నారు. చికిత్స పొందుతున్న ఆయన శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

కారు ఢీ: వృద్ధురాలికి గాయాలు

కేశంపేట: బస్సు కోసం ఎదురుచూస్తున్న వృద్ధురాలిని కారు ఢీకొన్న సంఘటన బైర్కాన్‌పల్లి శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. మహేశ్వరం మండలం పెద్దపులినాగారానికి చెందిన సయ్యద్ రబియాబీకి బైర్కాన్‌పల్లిలో వ్యవసాయభూమి ఉంది. చేను నుంచి శుక్రవారం ఆమె స్వగ్రామం వెళ్లేందుకు రోడ్డు పక్కన బస్సు కోసం చూస్తుండగా బైర్కాన్‌పల్లికి చెందిన చాకలి చంద్రశేఖర్ కారుతో ఢీకొట్టాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ నరహరి తెలిపారు.

తాండూరు నుంచే బీసీ ఉద్యమం

తాండూరు టౌన్: యాభై ఏళ్ల క్రితం తాండూరు నుంచే బీసీ ఉద్యమం ప్రారంభమైందని బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు కందుకూరి రాజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యను సంఘం తాండూరు శ్రేణులు, బీసీ మహిళా సంఘం నాయకులు నగరంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీ హక్కుల సాధనకు పోరాడుతూనే విద్యార్థి, నిరుద్యోగ సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు.